# దోమలు

'ఛిఛి ఎదవ దోమలు తెగకొరికేస్తన్నాయి', అని దోమల్ని నానా బూతులూ తిట్టి వాటిమీద వల్లమాలిన కోపం ప్రదర్శించాడు రాజబాబు.

దీపాలు పెట్టారు. ఇంకా రేడియోలో ఢిల్లీ వార్తలు రావడం లేదు. దోమలు మాత్రం చాలా వచ్చేశాయి. వచ్చేసి రక్తాలు పీల్చేస్తున్నాయి.

రాజబాబు 'స్టూలుబల్ల' మీద కూచున్నాడు. లోపల రమణ వున్నాడు. ఇది శ్రీ నూకాంబికా లారీ సప్లయి ఆఫీసు. అనకాపల్లి పాత బస్టాండు సమీపంలో పెద్ద మురుగు కాలవ పక్కనా, బెల్లం మార్కెట్టుకు అనతి దూరంలోనూ వుందా లారీ సప్లయి ఆఫీసు. ఒక చిన్నసైజు రేకుల షెడ్డు వంటి ఒకే ఒక గది. కింద పాత గచ్చు. కొంచెం చెమ్మగా, తడితడిగా వుంది. పైన పాత ఫాన్ చప్పుడు చేస్తూ తిరుగుతూ వుంది.

రమణ ఆ ఆఫీసులో గుమస్తా. రాజబాబు కళాసీ. రాజబాబుది నర్సీపట్నం పక్కనున్న చెట్టుపల్లి. పదేళ్లయి అనకాపల్లి వచ్చేశాడు. మొదట బెల్లం మార్కెట్లో బెల్లం దిమ్మలు మోసుకుతిరిగేవాడు. ఆ తరువాత పాత బస్టాండుకి వచ్చాడు. ఇప్పుడిక్కడికి బస్సులు రావడం మానేసి లారీలు మాత్రమే వస్తున్నాయి.

ఎర్రరంగు ప్రభుత్వ బస్సులన్నీ కొత్తగా వెలిసిన ఆర్టీసి కాంప్లెక్సుకు వెళ్లిపోయేయి. ఇప్పుడు బస్టాండు కళేపోయింది. ప్రయివేటు బస్సులన్నీ దాదాపు పోయేయి. ఆ ప్రాంతపు ఈగలూ, దోమలూ బస్సుల మీద గవర్నమెంటు బస్టాండుకు పోయేయి. బస్సుల కొద్దీ పోయిన దోమలు పోగా, లారీల కొద్దీ పుట్టుకొస్తూనే వున్నాయి.

ఫోను మోగింది. గుమస్తారమణ పోనందుకున్నాడు. 'ఆఁ..... సరే...... సరే...... 6584 ఇప్పుడే పంపించాను. అసోకా లేలెండు. ఆ..... కొత్తదే బండి. పెద్దబండే. సరే.... చెబుతాను. అలాగే....' అనేసి ఫోన్ పెట్టేశాడు.

రమణకి పాతికేళ్లు ఇంకా నిండలేదు. కాలేజీ చదువు సగంలో మానేసి ఏడుస్తూ ఏడేళ్లయింది. ఎందుకు మానేశాడా? చెప్పాలంటే 'జరుగుబాటు నేక'.

రమణ ఈ మధ్య చాలా అసహనంగా వుంటున్నాడు. గవరపాలెం హైస్కూలు పక్కనే వున్న గణపతి మేస్టారి దగ్గిర నాలుగు సంగతులూ ఆలకించి నాలుగు రకాల పుస్తకాలూ చదువుకుని, ఆయన చెప్పిన నాలుగు ముక్కలూ ఒంటబట్టేక ఎందుకో ఎప్పుడూ జ్వరంతో వున్న వాడిలాగ కాగిపోతున్నాడు. ఈ దేశాన్ని 'ఇప్పుడంటే ఇప్పుడే' మార్చేయాలన్నంత తొందరగా వుంటున్నాడు. ఈ దిక్కుమాలిన దేశంలో ఇంకా ఎప్పుడు సోషలిజం వస్తుంది? అని ప్రశ్నిస్తున్నట్టుంటున్నాడు. మొన్న మార్చిలో నెల్లూరు సభలకి వెళ్లి వచ్చాడు. గవర్రాజు గారి బెంజి బండి మీద, ఫ్రీగా.....

ఎదవ దోమలు.... ఎదవ దోమలు అని మళ్లీ విసుక్కుని, మరో రెండు కొత్త బూతులు తిట్టుకుని, కోపంగా నాలుగైదు దోమల్నిచంపేడు రాజబాబు.

అతనికి అన్ని మహాపట్నాల్లోనూ, అన్నిప్రాంతాల్లోనూ, ఇండియా 'హూల్ మొత్తం' మీద, అంత లెక్కా దోమలు కనిపించాయి. మొన్నటి దాకా బెల్లం లారీల మీద, ఇప్పుడు లోడు లారీల మీదా, ఒక ఢిల్లీ కాదు, కలకత్తా కాదు, కాన్పూరు కాదు, బొంబాయి కాదు ఇటు మెడ్రాసూ, మైసూరు,

బెంగుళూరు అంతా తిరిగేశాడు. దోమల్లేని వూరు లేదు. ఆ వూరు. ఈ వూరని లేదు. మొత్తం దేశం నిండా దోమలున్నాయన్న పరమ సత్యాన్ని ప్రత్యక్షంగా అనుభవజ్ఞానం ద్వారా తెలుసుకున్నాడు.

దోమలు తేళ్లల్లా కుట్టేస్తున్నాయి. తొడుక్కున్న జుబ్బాలోంచి కూడా కుట్టేస్తున్నాయి. కాళ్లకి మరీ కుట్టేస్తున్నాయి. 'ఇండీసన్' చేసినట్టు కుట్టేస్తున్నాయి. ఆ బాధకి తట్టుకోలేక దోమల్ని తిడుతున్నబూతులాపి..... "ఈజిమ్మడా...... దోమల్లేని దేసింవుందా రమణ బాబూ" అనడిగేడు, రాజబాబు. ఎక్కడుంటాది. ఉండదు గాక ఉండదు. ఉండటానికి ఈల్లేదు. అనేది రాజబాబు తిరుగులేని నమ్మకం.

మొదటి సంభాషణ దోమల్ని పారదోలే రకరకాల చిట్కాల మీద, మందులమీద సాగింది. కలబంద మట్ట కట్టడం, గాలి వానమొక్క కట్టడం. నూనెరాని కాయితం కట్టడం. పచ్చిరొడ్డ పొగలెయ్యడం. ఇవి కొన్ని దేశవాళీ చిట్కాలు. మానవుడు నాగరికత పొందుతూ త్వరితగతిని ఇరవై ఒకటో శతాబ్దంలోకి ప్రయాణించినట్టే, దోమలు మానవుడికంటె ముందు ఇరవైరెండో శతాబ్దంలో కూచోవడానికి సిద్ధంగా వున్నాయి. కనక ఈ దేశవాళీ చిటకాలు అట్టేపని చెయ్యడం లేదు. అవేవో చుట్టలు..... టాల్స్టాయి చుట్టలు... ('టార్టయిస్' అని ఎన్నిసార్లు రమణ విడివిడిగా పలికి చూపించినా రాజబాబు మాత్రం టాల్స్టాయి చుట్టలనే అంటాడు8. మహానుభావుడు 'టాల్స్టాయి' పరువు తీసేసేవు అని రమణ కోప్పడు తుంటాడు)..... అవి వెలిగిస్తే ఆ పొగకి దోమలు పోతాయట! అదేదో సూపు (ట్యూబు!) ఓడ్హౌస్ట దానిపేరు (పాపం ఓడ్హూస్! ఓడోమాస్ ఓడ్హూస్ చేసేశాడు) అది వంటికి రాసుకుంటే దోమలు కుట్టవట. కాని అవన్నీ నిత్యం కొనడానికి డబ్బు లెక్కణ్నించి వస్తాయి. పగలల్లా పనిచేసి వొళ్లు వుండయిపోతే ఒక కోటర్ గాని ఒక 'బీర్' గాని ఏసుకుందామంటేనే డబ్బులుండవు. ఎప్పుడు 'ప్ర.సా.దు' సరుకే గతి. ఇక దోమల మందు ఏం బెట్టి కొనాల్టల్లీ నూకాల్టల్లీ?

ఇలా సంభాషణ సాగుతూనే వుంది. రమణకి ఆవేశంతో క్రమంగా జ్వరం వచ్చేసినట్టయింది. ఇంకా సరికొత్త దోమల నివారణ మందులు, మరియు విధానములు గురించికూడా సంభాషణ సాగింది.

ఆ మందులకి దోమలెక్కడకి పోతాయి. పోవు. పోయినా మళ్లా వెంట వెంటనే పుట్టుకొస్తుంటాయి. నువ్వన్నట్టు తిండానికీ డబ్బుల్లేవు. నోరు తడుపుకోవడానికే సొమ్ముల్లేవు. ఈ టార్టాయిస్లూ, ఓడోమాస్లూ, మరోటీ ఈ మరోటీ కొనడానికి డబ్బులెలా వస్తాయి? అయితే కలిగిన వాళ్లూ, పెద్ద ఉద్యోగస్తులూ అవి కొంటూనే వున్నారు. ఈ మందులు తయారు చేయడానికి చాలా పెద్ద పెద్ద కంపెనీలు పోటీ పడుతున్నాయి. వాటి మీద బహుశా కోట్ల కొద్దీ బిజినెస్ నడుస్తోంది.

'యేటిదీ దోమలమందులకి_కోట్లకొద్ది బిజినెస్సా...?'

దోమల్ని పారదోలే మందుల మీద కోట్ల కొద్దీ బిజినెస్ నడుస్తుందంటే రాజబాబు నమ్మలేక పోయేడు. బెల్లం వ్యాపారం మీదో, బట్టల వ్యాపారం మీదో పెట్టుబడి గురించి అర్థం చేసుకోగలడు గాని దోమల మందుల బిజినెస్ మీద కోట్ల-టర్నోవరంటే నవ్వొచ్చింది వళ్లూ మండింది రాజబాబుకి.

దోమ తెరల గురించీ. మురుగు కాలవల్లో జల్లే మందుల గురించీ చెప్పాడు రమణ.

"మురుగు-నీరు పోయే దోవచేస్తే. శాన ఏ మందులూ ఎయ్యక్కర్లేదు" అన్నాడు రాజబాబు కూచున్నవాడల్లా దోమల బాధ పడలేక లేచి నిలబడి.

దోమల గుయ్యిమని శాస్త్రీయ సంగీతం వినిపిస్తున్నాయి. పక్క ఊరిమురకినంతా మోసుకొస్తున్న పెద్దకాలవ వుంది. దాని గట్లు పాయిఖానాలు.

జోరుగా కడుపు నొప్పొస్తే ఎక్కడికెల్లడానికీ సదుపాయం లేకపోతే జనం సస్తారేటీ?

'మందలాంటి మురికి కాలవల్లేకంటా ఏర్పాట్లు చెయ్యాలి' ఇది రాజబాబు అభిప్రాయం మాత్రమేకాదు. అనేక మంది రాజబాబుల అభిప్రాయం. శతిజయంతి చేసుకోబోతున్న అనకాపల్లి మునిసిపాలిటీకీ కాదు. దేశంలో అనేక పట్టణాల్లో పరిస్థితి ఇదే.

రమణ చాలా ఉద్రేకంగా ఈ కుళ్ల వ్యవస్థని తిడుతున్నాడు. రాజబాబు ఆలకిస్తున్నాడు. రమణ ఇంక తెలివి తేటల్తో ఇన్ని సంగతులు చెబుతాడనుకోలేదు. ఇంకా చెబుతున్నాడు.

'రేపు నెల్లూరు లోడట్టుకెల్లాంట' అంటూ వచ్చాడు.' నూకరాజు. వాడి నాన్న పేరు పెదనూక రాజు. వాడి తల్లి పేరు నూకాలమ్మ. పెళ్లాంపేరు నూకరత్నం. చల్లని తల్లి నూకాలమ్మ వాళ్లయింటి ఇలవేల్పు. ఆ చల్లని తల్లి వాళ్లకి చల్లారిన నూకల గంజే గాని, వేడివేడి వరి అన్నం ఎప్పుడో గాని పెట్టదు.

దోమలు కర్ణాటక సంగీతం ఆపలేదు.

'ఈ దోమల మందుల వ్యాపారం మీద చేతులు మారే కోట్లకొద్దీ సొమ్ముతో మురుగు నీటి కాలవలు నిర్మించాలి. మురుగు నీరు నిలవ ఉండకుండా ప్రతివూరూ పరిశుభ్రంగా వుంచాలి. గ్రామాల్లోనూ పట్టణాల్లోనూ వుండే మురుగు నీరంతా ఊరవతల పొలాల్లోకి పోయేలాగ దేశం మొత్తంలో పటిష్టమైన డ్రయినేజీ స్కీము ఏర్పాటు చేయ్యాలి. అప్పుడే దోమల బెడద వుండదు. ఈ రోగాలుండవు. కాని ఈ ప్రభుత్వం, ఈ పాలక వర్గాలు, ఈ బడా వ్యాపారస్తులు ఆ పని చెయ్యరు. చేస్తే తమ కోట్లకొద్దీ వ్యాపారం సాగదు. ప్రజలు రోగాల్తో చస్తూ చెప్పుకింద నల్లిలా అణిగి వుండాలి. వాళ్ల దుస్తితిని 'కాష్' చేసుకోవాలి..... దోమ తెరలొద్దు. దోమల మందులొద్దు. దోమలు అస్సలు లేని పరిస్థితులు కావాలి. పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన పరిసరాలు కావాలి. దోమల మందుల వ్యాపారంలో పెట్టేసొమ్ము ఆరోగ్య పథకాలు మీద పెడితే దోమల్ని చాలా వరకూ నిర్మూలించ వచ్చు. అప్పుడు ఈ దోమలూ వుండవు. దోమల వల్ల ఈ బాధలు, జబ్బులూ కూడా వుండవు.

'దోమలకి కుటుంబ నియంత్రణ ఆపరేసనేటీ'? అని వేళకోళంగా నవ్వేడు రాజబాబు.

'మన వాళ్ల పథకాలన్నీ ఇలాగే వుంటాయి. ఈ కుళ్లు వ్యవస్థని సమూలంగా నాశనంచేసి, సమ సమాజాన్ని నిజమైన ప్రజాస్వామ్యాన్ని స్థాపించుకుంటే తప్ప 'దోమలేకాదు మనల్నిపట్టిపీడిస్తున్న ఏ దుష్ట శక్తులూ పోవు.... ఇతర గ్రహాలకు ప్రయాణాలు, కంప్యూటర్లతో సకల పనులూ, బిడ్డలు పుట్టడం, గుండెలు మార్చడం.... ఇన్ని చేస్తున్న వాళ్లకి దోమల్ని నిర్మూలించడం అసాధ్యమా..... కాదు ఆ వుద్దేశం పాలక వర్గాలకు లేదు దోమలు పెరుగుతూనే వుండాలి. దోమల మందుల బిజినెస్ సాగుతూనే వుండాలి. అదీ అసలు సంగతి'.

ఫోను మోగుతోంది. ఆ ఉద్రేకం లోంచి తేరుకుని ఫోను తియ్యడానికి లేచాడు రమణ.

'రేపు లోడు....' అని మొదలు పెట్టాడు నూకరాజు. దీపాలు పెట్టేరు.

హెలికాప్టర్ దిగినంత దుమ్ము రేపి, అంతకంటె ఎక్కువ చప్పుడు చేస్తూ పాత బెంజిలారీ వచ్చి ఆగే సరికి దోమల సంగీతం ఎవరికీ వినిపించడంమేనేసింది.

*రచనా కాలం : 1988*

*ప్రచురణ : వలుపు, మే 16-31-1992*